రజతోత్సవ సభకు పెద్ద ఎత్తున తరలి రావాలి

పరకాల ఏప్రిల్ 24 : ఎల్కతుర్తిలో నిర్వహిస్తున్న రజతోత్సవ సభకు బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున తరలి రావాలని మండలాధ్యక్షుడు చింతిరెడ్డి మధుసూదన్‌రెడ్డి కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ రజతోత్సవ సభను పండుగలా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారన్నారు. బీఆర్ఎస్ శ్రేణులు, ప్రజలు పెద్ద ఎత్తున సభకు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

డిమాండ్‌కు అనుగుణంగా వసతులు కల్పించాలి

ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న సీఎండీ వరుణ్‌రెడ్డి

హనుమకొండ, ఏప్రిల్ 24 : భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా మౌలిక సదుపాయాలు కల్పించాలని ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి ఆదేశించారు. గురువారం నక్కలగుట్టలోని విద్యుత్ భవన్ నుంచి ట్రాన్స్‌కో డైరెక్టర్లు, సీఈలు, ఎస్ఈలు, ఎన్పీడీసీఎల్ డైరెక్టర్లు, సీఈలు,16 సర్కిళ్ల ఎస్ఈలతో రాబోయే 5,10 సంవత్సరాల కాలానికి సంబంధించి చేపట్టాల్సిన భవిష్యత్ కార్యాచరణపై సమావేశం నిర్వహించారు. అనంతరం సీఎండీ మాట్లాడుతూ.. ట్రాన్స్‌కో పరిధిలోని కరీంగనగర్, మంచిర్యాల, నిర్మల్, జగిత్యాల, సిరిసిల్లలోని లోడ్‌కు అనుగుణంగా కొత్తగా 132/33 కేవీ సబ్‌స్టేషన్ల నిర్మాణానికి ఆవశ్యకత ఉందన్నారు. విధిగా ప్రతి సెక్షన్ ఏఈ వారానికి ఒకసారి పొలం బాట కార్యక్రమం చేపట్టాలని ఆదేశించారు. త్వరలో డాష్ బోర్డు ప్రారంభిస్తామని, దీంతో ప్రతి ఒక్కరూ సమగ్ర సమాచారం తెలుసుకునే అవకాశం ఉంటుందన్నారు. ఎల్సీ యాప్ టాన్‌లలో చేపడుతున్నారని, దీన్ని ఇంకా విస్తరించాలని సూచించారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో డైరెక్టర్ జగత్‌రెడ్డి, సంస్థ ఇన్‌చార్జి డైరెక్టర్లు అశోక్ కుమార్, సదర్‌లాల్, మధుసూదన్, ట్రాన్స్‌కో సీఈలు శ్రవణ్‌కుమార్, విజయ్ కుమార్, డిస్కం సీఈలు తిరుమల్‌రావు, రాజుహాన్, అశోక్, బికం సింగ్ పాల్గొన్నారు.

ప్రసవానంతర సేవలు అందించాలి : డీఎంహెచ్‌వో

దామెర, ఏప్రిల్ 24 : ఆయుష్మాన్ ఆరోగ్యమందిర్ ద్వారా ప్రసవానంతర సేవలను అందించాలని డీఎంహెచ్‌వో అప్పయ్య వైద్య సిబ్బందిని ఆదేశించారు. గురువారం మండలంలోని ఊరుగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఆయుష్మాన్ ఆరోగ్య నూతన భవనాన్ని పరిశీలించి గ్రామానికి చెందిన పోలెపాక సుజాత, పండుగ రవళి గృహాలకు వెళ్లి ప్రసవానంతర సేవలు అందుతున్నాయా అని ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో 12రకాల సేవలు ఉన్నాయన్నారు. సమయపాలన పాటించాలని సిబ్బందికి సూచించారు.

డాగ్ షెడ్ నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలి

మేయర్ గుండు సుధారాణి

వరంగల్, ఏప్రిల్ 24 : డాగ్ షెడ్‌ను త్వరగా పూర్తి చేయాలని మేయర్ గుండు సుధారాణి అధికారులను ఆదేశించారు. గురువారం చింతగట్టు ప్రాంతంలోని యానిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్‌ను తనిఖీ చేశారు. సెంటర్‌లో ప్రతి రోజు ఎన్ని కుక్కలకు ఆపరేషన్లు చేస్తున్నారని అధికారులను అడిగారు. ప్రతి రోజు 20 కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేస్తున్నామని, అదనంగా నిర్మిస్తున్న షెడ్ పూర్తయితే అదనంగా మరో 20 ఆపరేషన్లు చేసే అవకాశం ఉంటుందని అధికారులు వివరించారు. డాగ్ షెడ్ ఆవరణలో సోలార్ ప్యానల్స్ ఏర్పాటు చేసుకుని వాటి ద్వారా విద్యుత్ వినియోగించుకోవాలని మేయర్ సూచించారు. వేసవిలో ఉష్ణోగ్రతలను దష్టిలో ఉంచుకుని పార్కులు, కుక్కల సంచార ప్రాంతాలను గుర్తించి గ్రేటర్ పరిధిలో 300 నీటి తోట్టెలను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో సీఎంహెచ్‌వో రాజారెడ్డి, వెటర్నిటీ డాక్టర్ గోపాల్‌రావు, ఈఈ సంతోష్ బాబు, డీఈ రవికిరణ్, ఏఈ సతీష్ పాల్గొన్నారు.

రాష్ట్ర అర్చక, ఉద్యోగ, జేఏసీ డైరీ ఆవిష్కరణ

భీమదేవరపల్లి, ఏప్రిల్ 24 : తెలంగాణ రాష్ట్ర అర్చక, ఉద్యోగ, జేఏసీ డైరీని గురువారం కొత్తకొండ వీరభద్రస్వామి ఆలయ ఆవరణలో చైర్మన్ గంగు ఉపేందర్ శర్మ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్చక, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఉప ప్రధాన అర్చకులు రాజయ్య, రాంబాబు, శ్రీకాంత్, వినయ్, శివకుమార్, శరత్‌చంద్ర, సందీప్, శ్రావణ్, రవి పాల్గొన్నారు.

దొంగతనం కేసులో వ్యక్తి అరెస్ట్

దామెర, ఏప్రిల్ 24 : మండలంలోని కోగిల్వాయిలో గత సంవత్సరం డిసెంబర్ నెలలో జరిగిన మేకల దొంగతనం కేసులో ఒకరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ట్రైనీ ఐపీఎస్ అధికారి మనన్‌భట్ గురువారం తెలిపారు. ట్రైనీ ఐపీఎస్ కథనం ప్రకారం.. మేకల దొంగతనం కేసులో ఇప్పటికే ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించగా, అప్పటి నుంచి పరారీలో ఉన్న హైదరాబాద్ ఘట్‌కేసర్ పరిధిలోని రూక్‌బాండ్‌కు చెందిన ప్రధాన నిందితుడు కందికొండ వికాస్‌కుమార్‌ను దామెర శివారులోని డీస్నీల్యాండ్ స్కూల్ వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా పోలీసులు గుర్తించి పట్టుకున్నారు. పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వికాస్ కుమార్‌పై ఇప్పటికే పలు పోలీస్‌స్టేషన్లలో 30కిపైగా కేసులు, దామెర పోలీస్‌స్టేషన్‌లో 4కేసులు ఉన్నాయని తెలిపారు. గురువారం వికాస్‌కుమార్‌ను కోర్టులో ప్రవేశపెట్టగా, న్యాయమూర్తి రిమాండ్ విధించారు. కార్యక్రమంలో ఎస్సై కొంక అశోక్ పాల్గొన్నారు.

సమ్మర్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలి

హనుమకొండ చౌరస్తా, ఏప్రిల్ 24 : హనుమకొండ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో నిర్వహించే వేసవి క్రీడాశిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని యువజన, క్రీడల అధికారి గుగులోత్ అశోక్‌కుమార్ తెలిపారు. ఈ నెల 25వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులను హనుమకొండ స్పోర్ట్స్ అథారిటీ కార్యాలయంలో శుక్రవారం అందజేయాలని కోరారు. కలెక్టర్ ప్రావీణ్య ఆదేశాల మేరకు స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా మొత్తం 25 క్రీడాంశాల్లో శిబిరాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ నెల 30న బాస్కెట్ బాల్ కోర్టులో వేసవి శిక్షణ శిబిరాల ప్రారంభోత్సవ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. వివరాలకు 97046 69637 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

రైల్వే పాలిక్లినిక్‌లో కంటి పరీక్షలు ప్రారంభం

కాజీపేట, ఏప్రిల్ 24 : కాజీపేటలోని రైల్వే పాలిక్లినిక్‌లో కంటి పరీక్షలు ప్రారంభమయ్యాయని, రోగులు సద్వినియోగం చేసుకోవాలని రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ లోకో రన్నింగ్ బ్రాంచి చైర్మన్ పాక రాజ్‌కుమార్ గురువారం తెలిపారు. ప్రస్తుతం కంటికి సంబంధించిన అన్ని పరీక్షలు, ఆపరేషన్లు రైల్వే దవాఖానలో చేస్తారని తెలిపారు.

అంగన్‌వాడీలకు మే నెల సెలవులు ఇవ్వాలి

హనుమకొండ, ఏప్రిల్ 24 : వేసవి తీవ్రత, వడగాలులను దృష్టిలో పెట్టుకొని అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు సెలవు ఇవ్వాలని అంగన్‌వాడీ యూనియన్ గౌరవాధ్యక్షుడు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేశ్ డిమాండ్ చేశారు. గురువారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోజు రోజుకు ఉష్ణోగ్రతలు పెరుగుతుండడంతో ప్రభుత్వ పాఠశాలలకు ఇస్తున్నట్లు మే మాసం సెలవులు ఇవ్వాలన్నారు. అనంతరం కలెక్టర్ ప్రావీణ్యకు వినతిపత్రం అందజేశారు. నాంపల్లి శోభారాణి, జమున, అరుణ, సత్తెమ్మ, తిరుమల, మమత, ప్రమీల, లక్ష్మి, సునీత, స్వరూప పాల్గొన్నారు.

'ఎయిర్‌పోర్టుకు జయశంకర్ సార్ పేరు పెట్టాలి'

హనుమకొండ చౌరస్తా ఏప్రిల్ 24 : మామునూరు విమానాశ్రయానికి తెలంగాణ సిద్ధాంత కర్త, ఆచార్య జయశంకర్ సార్ పేరు పెట్టాలని విశ్వ బ్రాహ్మణ విశ్వకర్మ రాష్ట్ర అధ్యక్షుడు వేములవాడ మదన్మోహన్, గౌరవాధ్యక్షుడు లాలుకోట వెంకటాచారి, ప్రధాన కార్యదర్శ చొల్లేటి కృష్ణమాచార్యులు, కోశాధికారి రవీంద్రాచారి అన్నారు. రాజకీయాలకు అతీతంగా తెలంగాణ ప్రజల గౌరవం, ఆచార్య జయశంకర్ త్యాగం, విలువలను నిలబెట్టే ఒక చారిత్రక అవకాశమన్నారు.

కొనసాగుతున్న కాంట్రాక్టు అధ్యాపకుల సమ్మె

హనుమకొండ చౌరస్తా ఏప్రిల్ 24 : కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులర్ చేయాలని కేయూ పరిపాలనా భవనం ఎదుట కాంట్రాక్టు అధ్యాపకులు చేపట్టిన సమ్మె ఆరో రోజుకు చేరింది. మాజీ ఎమ్మెల్యే మూర్తినేని ధర్మారావు, ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు మంద కుమార్, సీపీఎం జిల్లా కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి సంఘీభావం తెలిపారు. కాంట్రాక్ట్ అధ్యాపకులు రెండో గేటు వద్దకు డప్పు చప్పులతో ర్యాలీ తీసి వంటా వార్పు కార్యక్రమం నిర్వహించారు. కరుణాకర్‌రావు, ఆశీర్వాదం, శ్రీధర్‌కుమార్ లోధ్, సాదు రాజేశ్, జూల సత్య పాల్గొన్నారు.

పరకాల : కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పిస్తున్న ప్రధాన న్యాయమూర్తి శాలిని, న్యాయవాదులు

హనుమకొండ : కాళోజీ సెంటర్‌లో ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దహనం చేస్తున్న సీపీఐ నాయకులు

కాజీపేట : కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న తేజోమయి మాల కుల సంక్షేమ సంఘం

వరంగల్ లీగల్ : కోర్టు ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

మత విద్వేషాలు రెచ్చగొట్టే ఉగ్ర కుట్ర ఇది

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్
- ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలి
- జూనియర్ సివిల్ కోర్టు ప్రధాన న్యాయమూర్తి శాలినీ లింగం
- జిల్లాలో పలుచోట్ల ఉగ్రవాదుల ఘాతుకానికి వ్యతిరేకంగా నిరసనలు
- అమరులకు కొవ్వొత్తులతో నివాళి

పరకాల/హనుమకొండ, ఏప్రిల్ 24 : దేశవ్యాప్తంగా మత విద్వేషాలు రెచ్చగొట్టే ఉగ్రవాదుల కుట్ర ఇది అని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. బీఆర్ఎస్ జిల్లా యువజన విభాగం ఆధ్వర్యంలో బాలసముద్రంలోని పార్టీ కార్యాలయం నుంచి అదాలత్ సెంటర్‌లోని అమరవీరుల స్తూపం వరకు కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ నిర్వహించారు. అమరుల ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉగ్రదాడిలో అమాయక పర్యాటకుల ప్రాణ నష్టం దేశాన్ని దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. భారతమాత బిడ్డలైన 28 మంది పర్యాటకులు ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోవడం విషాదకరమన్నారు. భారతీయుల ఐక్యతను దెబ్బతీసేందుకు ఉగ్ర మూకలు ప్రయత్నిస్తున్నాయని, ప్రజలు శాంతియుతంగా, ఐక్యంగా ఎదుర్కోవాలని కోరారు. దేశ భద్రతకు ముప్పుగా మారుతున్న ఇటువంటి ఘటనలపై కేంద్ర ప్రభుత్వం పకడ్బందీ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నామని తెలిపారు. కాశ్మీర్‌లోని పహల్గాంలో టూరిస్టులను హతమార్చిన తీవ్రవాదులను కఠినంగా శిక్షించాలని జూనియర్ సివిల్ కోర్టు ప్రధాన న్యాయమూర్తి శాలినీ లింగం అన్నారు. పహల్గాం మృతులకు సంఘీభావంగా కోర్టు ఆవరణలో కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. టూరిస్టులను హతమార్చడం అత్యంత దారుణమన్నారు. అనంతరం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తీవ్రవాదులను కఠినంగా శిక్షించాలని అంటూ పరకాల బస్టాండ్ సెంటర్‌లో ప్రధాన రహదారిపై న్యాయవాదులు రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు రాజిరెడ్డి, రాజమౌళి, మేరుగు శ్రీనివాస్, స్వామి, చంద్రమౌళి, గండ్ర నరేశ్‌రెడ్డి, రమేశ్, రాహుల్ విక్రమ్, సురేశ్, రాజు, చంద్రమోహన్, పవన్ కల్యాణ్ పాల్గొన్నారు. సీపీఐ ఆధ్వర్యంలో కాళోజీ జంక్షన్‌లో ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దహనం చేశారు. జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేశ్ మాట్లాడుతూ.. ఉగ్రవాదాన్ని అంతం చేయాలని, ఉగ్రమూకలను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. దేశ సమగ్రత సమగ్రత, సమైక్యతను పరిరక్షించడానికి కేంద్ర, కశ్మీర్ ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలన్నారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కు రాజు గౌడ్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు వేల్పుల సారంగపాణి, నాయకులు మాలోత్ శంకర్ నాయక్, గుంటి రాజేందర్, మద్దెల శ్రీనివాస్, కృష్ణ పాల్గొన్నారు. అమాయక ప్రజలపై ఉగ్రవాదుల దాడి సిగ్గుమాలిన చర్య అని, దీన్ని పూర్తిగా ఖండిస్తున్నామని టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్ అన్నారు. గురువారం రాత్రి కలెక్టరేట్ నుంచి కీర్తి స్తూపం వద్దకు ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొని కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అమాయక ప్రజల మృతికి కారణమైన వారిని వదిలిపెట్టొద్దన్నారు. జిల్లా కార్యదర్శి బైరి సోమయ్య, అసోసియేట్ అధ్యక్షుడు పుల్లూరు వేణుగోపాల్, కోశాధికారి పనికల రాజేశ్, గౌరవాధ్యక్షుడు శ్యాంసుందర్, కేంద్ర సంఘం నేతలు రాము నాయక్, మొయిజ్, లక్ష్మీప్రసాద్, జిల్లా నేతలు రాజమౌళి, సురేశ్, రాజేశ్‌ఖన్నా, భగవాన్‌రెడ్డి, గౌతం, పృథ్వీ, ప్రణయ్, అశోక్, రాజీవ్, నిఖిల్, పైడి రాజు, శ్రీనివాస్, అజీమ్, గ్రేస్, నాగరాణి పాల్గొన్నారు. కాజీపేట పట్టణంలో తేజోమయి మాల కుల సంక్షేమ సంఘం పట్టణాధ్యక్షుడు మర్యాల కృష్ణ, పీస్ కమిటీ పట్టణాధ్యక్షుడు సయ్యద్ సర్వర్ పాషా ఆధ్వర్యంలో పలువురు రైల్వే స్టేషన్ నుంచి చౌరస్తా వరకు కొవ్వొత్తులతో ర్యాలీ చేపట్టారు. చౌరస్తాలో ఉగ్రవాదుల దాడిలో అశువులు బాసిన టురిస్టుల చిత్రపటాల ముందు మౌనం పాటించి శాంతి నినాదాలు చేశారు. సీహెచ్ కొమ్మాలు, కొండ్ర నర్సింగరావు, పప్పుల గోవర్ధన్, శంకర్, విజయ్ కుమార్, సత్యనారాయణ, భద్రయ్య, సాంబయ్య, రాజలింగం, రసూల్, షరీఫ్, జామీద్, చోటు, మురళి, మోహన్, రాజు, కుమారస్వామి, వెంకటేశ్ పాల్గొన్నారు. అందమైన కశ్మీరాన్ని అస్తవ్యస్తం చేయాలనుకుంటున్న పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రదాడిని న్యాయవాదులు ముక్తకంఠంతో ఖండించారు. విధులను బహిష్కరించి కోర్టు నుంచి కలెక్టర్ ఆఫీసు వర కు ర్యాలీ నిర్వహించి ఉగ్రవాదులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వరంగల్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వలుస సుధీర్, హనుమకొండ అధ్యక్షుడు పులి సత్యనారాయణ, న్యాయవాదులు సహోదర్‌రెడ్డి, విద్యాసాగర్‌రెడ్డి, మహమూద్, శ్యామ్ సుందర్‌రావు, శ్యామ్ సుందర్‌రెడ్డి, అఖిల్‌పాషా పాల్గొన్నారు.

కలెక్టరేట్ నుంచి కీర్తి స్తూపం వద్దకు కొవ్వొత్తుల ర్యాలీగా వస్తున్న టీఎన్జీవోలు

గ్రీన్ ల్యాండ్ ఆక్రమణలను నియంత్రించాలి

గ్రేటర్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

వరంగల్, ఏప్రిల్ 24 : గ్రేటర్ పరిధిలోని గ్రీన్ ల్యాండ్ ఆక్రమణల నియంత్రణకు ఇనుప ముళ్ల కంచెలు ఏర్పాటు చేయాలని కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులను ఆదేశించారు. గురువారం ఎల్లాపూర్ సమీపంలోని బల్దియా నిర్వహిస్తున్న నర్సరీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వన మహోత్సవాన్ని దృష్టిలో ఉంచుకుని మొక్కలను పెంచాలన్నారు. బల్దియా ఆధ్వర్యంలోని 12 నర్సరీల్లో 10 లక్షల మొక్కలు పెంచేలా ప్రణాళికలు చేసుకోవాలని సూచించారు. ఎక్కువగా పూలు, పండ్ల మొక్కలు పెంచాలన్నారు. మొక్కలు ఎండిపోకుండా రోజుకు మూడు సార్లు నీళ్లు పోయాలన్నారు. టౌన్‌ప్లానింగ్, కార్యక్రమంలో హార్టికల్చర్ అధికారి రమేశ్ పాల్గొన్నారు.

ఎల్కతుర్తి జంక్షన్ ప్రారంభానికి ఏర్పాట్లు చేయాలి..

ఎల్కతుర్తి జంక్షన్‌ను ప్రారంభానికి సిద్ధం చేయాలని కుడా వైస్ చైర్మన్ అశ్విని తానాజీ వాకడే అధికారులను ఆదేశించారు. ఎల్కతుర్తి జంక్షన్ పనులను పరిశీలించారు. ఉమ్మడి వరంగల్, కరీంనగర్, సిద్దిపేట జిల్లాలకు ఈ జంక్షన్ తలమానికంగా నిలిచేలా నిర్మిస్తున్నామన్నారు. ఇప్పటికే 80 శాతం పనులు పూర్తయ్యాయని, సెంట్రల్ మీడియం, హైలాండ్, గ్రీనరీ, ఫినిషింగ్ పనులను త్వరగా పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో కుడా పీవో అజిత్‌రెడ్డి, ఈఈ బీమ్‌రావు పాల్గొన్నారు.

నర్సరీని పరిశీలిస్తున్న కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు ఘన స్వాగతం

కాజీపేట బాపూజీనగర్‌లో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు స్వాగతం పలుకుతున్న జాగృతి శ్రేణులు

కాజీపేట, ఏప్రిల్ 24 : జిల్లాలో జరిగే పలు కార్యక్రమాల్లో పాల్గొందుకు నగరానికి వచ్చిన భారత జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు బాపూజీనగర్ చౌరస్తాలో జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాస్యం విజయ్‌భాస్కర్ ఆధ్వర్యంలో పలువురు గురువారం ఘన స్వాగతం పలికారు. జాగృతి మహిళా కార్యకర్తలు ఆమెకు బొట్టుపెట్టి పూలమాలలతో సన్మానించారు. కవితతో ఫొటోలు దిగేందుకు మహిళలు, యువత, కార్యకర్తలు, నాయకులు పోటీపడ్డారు. ఆ ప్రాంతమంతా జై జాగృతి, జై కవితక్క, కేసీఆర్ జిందాబాద్, కేటీఆర్ జిందాబాద్, బీఆర్ఎస్ జిందాబాద్ నినాదాలతో మార్మోగింది. జాగృతి విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు పబ్బోజు శ్రీకాంతాచారి, నాయకులు సుశీల్, ఉదిత్, హరీశ్‌రెడ్డి, నర్సింహారెడ్డి, ఆశిష్, అజయ్, జాగృతి మహిళ జిల్లా ఉపాధ్యక్షురాలు పాకనాటి మంజులారావు, నూకల రాణి పాల్గొన్నారు.

భద్రకాళీని దర్శించుకున్న ఎమ్మెల్సీ కవిత..

వరంగల్ : నగరంలోని ప్రసిద్ధ భద్రకాళీ అమ్మవారిని ఎమ్మెల్సీ కవిత దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ మహా మండపంలో అర్చకులు ఆమెకు ఆశీర్వచనం ఇచ్చి అమ్మవారి శేషవస్త్రాలు బహూకరించి, ప్రసాదం అందజేశారు. మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయభాస్కర్ ఉన్నారు.

ఎల్లాపూర్‌లో మృతదేహం గుర్తింపు

హసన్‌పర్తి, ఏప్రిల్ 24 : గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన ఎల్లాపూర్‌లో శుక్రవారం జరిగింది. ఎస్సై దేవేందర్ కథనం ప్రకారం.. 65వ డివిజన్ పరిధిలోని ఎల్లాపూర్ బస్టాండ్ సమీపంలోని గోలి తిరుపతిరెడ్డి ఇంటి ముందు రేకుల షెడ్డులో మృతదేహాన్ని గుర్తించారు. వయసు సుమారు 48 నుంచి 51 సంవత్సరాలు ఉంటుందని, నీలం రంగు షర్ట్, నలుపు రంగు ప్యాంట్ ధరించాడని, అతడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని చెప్పారు. అతడి ప్యాంటు జేబులో సిద్ధా బార్ అండ్ రెస్టారెంట్ చంద్రాపూర్ (ఎంహెచ్) పేరుతో బిల్లు ఉందని, ఎవరైనా సంబంధీకులుంటే 8712685015, 8712685097, 8712685124 నంబర్లలో సంప్రదించాలని ఎస్సై తెలిపారు.

నిట్‌లో ప్రపంచ డీఎన్ఏ దినోత్సవం

హనుమకొండ చౌరస్తా, ఏప్రిల్ 24 : ప్రపంచ డీఎన్ఏ దినోత్సవం సందర్భంగా ఎన్ఐటీలోని సెంట్రల్ రీసెర్చ్ ఇన్ స్ట్రుమెంటేషన్ ఫెసిలిటీ (సీఆర్ఐఎఫ్) ఆధ్వర్యంలో యునైటెడ్ బయలాజికల్స్, థెర్మోఫిషర్ సైంటిఫిక్ సహకారంతో టెక్నాలజీ ఎక్స్ పో నిర్వహించారు. జీవవిజ్ఞానం, అణుజీవశాస్త్రం రంగాల్లో అత్యాధునిక పరికరాలను ప్రదర్శించారు. విద్యార్థుల సంక్షేమ డీన్ శ్రీనివాసాచార్య ప్రారంభించారు. ఆర్ అండ్ డీ ఇన్‌చార్జి డీన్ శ్రీనివాసరావు, ఐ-స్టెమ్ చైర్మన్ వీరేశ్‌బాబు, సీఆర్ఐఎఫ్ విభాగాధిపతి శ్రీలక్ష్మి, కార్యక్రమ సమన్వయకర్త, సాంకేతిక అధికారి రవికుమార్ పాల్గొన్నారు.

'యాక్షన్ రీసెర్చ్ మెంటరింగ్ స్కీమ్ కాన్క్లేవ్' ప్రారంభం..

నిట్‌లో 'యాక్షన్ రీసెర్చ్ మెంటరింగ్ స్కీమ్ కాన్క్లేవ్-2025' ప్రారంభించారు. ఎన్ఐటీలోని బ్రిటిష్ కౌన్సిల్ (బిసి) మద్దతుతో ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ (ఎల్టా) తెలంగాణ సహకారంతో నిర్వహిస్తున్న రెండు రోజుల ఈవెంట్ 'క్లాస్ రూంలో బహుభాషాత్మకత' అనే థీమ్‌పై ఈ కాన్క్లేవ్ ప్రారంభమైంది. ముఖ్యఅతిథిగా ఢిల్లీ విశ్వవిద్యాలయ మాజీ ప్రొఫెసర్ రామమాధ్యూ పాల్గొని ప్రతి ఇంగ్లిష్ భాష బోధకుడు యాక్షన్ రీసెర్చ్‌లో చురుకుగా పాల్గొనాల్సిన అవసరాన్ని వివరించారు. ఇన్‌చార్జి డైరెక్టర్ ఉమామహేశ్ ఇంగ్లిష్ ప్రధాన భాషగా ఉన్న విద్యాసంస్థల్లో బహుభాషా బోధన అవసరాన్ని వివరించారు. ఎల్టా అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, బ్రిటిష్ కౌన్సిల్ సీనియర్ మేనేజర్ ప్రతినిధి మిస్ జూడిత్ హెంబ్రోమ్ ఆన్‌లైన్‌లో పాల్గొన్నారు.

పార్ట్ టైం అధ్యాపకులకు న్యాయం చేయాలి

ప్రభుత్వ సలహాదారు కేశవరావుకు వినతిపత్రం అందజేస్తున్న పార్ట్‌టైం అధ్యాపకులు

హనుమకొండ చౌరస్తా, ఏప్రిల్ 24 : పార్ట్‌టైం అధ్యాపకులకు న్యాయం చేయాలని ప్రభుత్వ సలహాదారు కేశవరావుకి విజ్ఞప్తి చేశారు. పార్ట్‌టైం అధ్యాపకుల బృందం కేశవరావును ఆయన నివాసంలో కలిసి తమ సమస్యలను వివరించారు. మినిమం టైం స్కేల్ ఇస్తూ ఉద్యోగ భద్రత కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా కేశవరావు మాట్లాడుతూ.. పార్ట్‌టైం అధ్యాపకుల సమస్యలు పరిష్కరించడానికి తనవంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

గంజాయి పట్టివేత.. ఒకరి అరెస్ట్

కాజీపేట, ఏప్రిల్ 24 : పట్టణంలో పోలీసులు గంజాయి పట్టుకుని, విక్రయదారుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన ఘటన గురువారం జరిగింది. కాజీపేట సీఐ సుధాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని వడ్డేపల్లి చెరువు కట్ట పక్కన, సుబ్రహ్మణ్య స్వామి దేవాలయం వెనుక ప్రాంతంలో పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా ప్లాస్టిక్ కవర్ కలిగిన ఓ వ్యక్తి అనుమానంగా కనిపించి, పోలీసులను చూచి పారిపోతుండగా, పట్టుకుని తనిఖీ చేయడంతో గంజాయి బయట పడిందన్నారు. న్యూ సైన్స్ కళాశాలలో డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్న నగరంలోని జూలైవాడకు చెందిన వల్లెపు రఘు తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలనే అత్యాశతో గంజాయి విక్రయిస్తున్నాడు. రఘు మూడు రోజుల క్రితం నాగపూర్ రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి నుంచి 300 గ్రాముల గంజాయిని రూ. 6వేలకు కొనుగోలు చేసి విక్రయించేందుకు వడ్డేపల్లి చెరువు కట్ట వద్దకు రాగానే పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై లవన్‌కుమార్ నిందితుడు రఘు పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వివరించారు.

సీజీఆర్ఎఫ్ - 1 స్వతంత్ర సభ్యుడిగా రామారావు

హనుమకొండ, ఏప్రిల్ 24 : తెలంగాణ విద్యుత్ నియంత్రణ కమిషన్ వరంగల్ సీజీఆర్ఎఫ్ -1 స్వతంత్ర సభ్యుడిగా మందానపు రామారావు నియమితలయ్యారు. ఈ మేరకు ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వ